క్లుప్తంగా

కాలువ పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న నాయకులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి ముడోవార్డు పద్మనాభపురం గ్రామంలో నిర్మిస్తున్న సీసీ కాలువ పనులను నాయకులు ఆదివారం పరిశీలించారు. మున్సిపల్ జనరల్ ఫండ్ రూ.16 లక్షలతో పాతజాతీయ రహదారి నుంచి శనీశ్వరాలయం వరకు నిర్మిస్తున్న కాలువ పనులను మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కౌన్సిలర్లు దువ్వాడ శ్రీకాంత్, మూల క్రిష్టారావు పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నిర్మాణదారులకు సూచించారు.

జంగిల్‌ను తొలగించండి



ట్రాన్స్‌ఫార్మర్‌ను కప్పేసిన పిచ్చిమొక్కలు

టెక్కలి: టెక్కలి పాతబస్‌స్టాండ్ స్టేట్‌బ్యాంకు వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పిచ్చిమొక్కలు కప్పేశాయి. దీంతో తరచూ విద్యుత్ సమస్య తలెత్తుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూపేరుకుపోయిన జంగిల్‌ను క్లియర్ చేయాలని కోరుతున్నారు.

రూ. 25 వేల ఆర్థిక సాయం



మన్మథరావుకు సాయాన్ని అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ సభ్యులు

కంచిలి: జాడుపూడి గ్రామానికి చెందిన కొయ్య మన్మథరావు కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం చేయించినప్పటికీ నయం కాలేదు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో వైద్యానికి ఇబ్బంది పడుతున్నారు. దీంతో స్థానికంగా ఉన్న ఎస్.జీఎఫ్ సేవా సంస్థను సంప్రదించారు. వారు స్పందించి తక్షణ సాయంగా రూ. 25 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడికి ఆదివారం అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు.

యువ రచయితల వేదిక కార్యవర్గ ఎన్నిక

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయం సమావేశ మందిరంలో ఆదివారం యువ రచయితల వేదిక నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా సురంగి మోహనరావు, అధ్యక్షులుగా తంగి ఎర్రమ్మ, ప్రధాన కార్యదర్శిగా బలివాడ ధనుంజయరావు, గౌరవ సలహాదారులుగా ప్రొఫెసర్ విష్ణుమూర్తి, ఆరికతోట కనకరాజు, కార్యవర్గ సభ్యులుగా గణస్వామి, లింగరాజు, కె.శ్రీనివాసరావు, కర్నేన జనార్దనరావు, కోశాధికారిగా రాకోటి చిన్నారావు, సాంస్కృతిక విభాగం కార్యదర్శిగా సోదవరం ఈశ్వరరావు, గుడిమెట్ల గోపాలకృష్ణ, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కవులు తమ కవితలను వినిపించారు. సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతికి సంతాపం తెలియజేశారు.

బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి



మాట్లాడుతున్న పూజారి హరిప్రసన్న

పొందూరు: ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా బదిలీపై స్థానాలు మారిన వారికి తక్షణమే జీతాలు చెల్లించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పొందూరులో ఆదివారం ఉదయం అఫీషియల్ కాలనీలోని డీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి గురుగుబెల్లి రాజశేఖర్‌తో కలిసి హరిప్రసన్న మాట్లాడారు. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కొన్ని పాఠశాలలకు కొత్తగా హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, క్లస్టర్ ఉపాధ్యాయుల పోస్టులను సృష్టించి బదిలీలు చేశారు. నూతనంగా సృష్టించిన ఉపాధ్యాయ పోస్టుల్లో నియమించిన వారికి పొజిషన్ ఐడీ నంబర్లు ఇంతవరకు కేటాయించకపోవడంతో జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎంలతోపాటు మిగిలిన ఉపాధ్యాయులు కూడా రెండు నెలలుగా జీతాలు అందలేదన్నారు. రోజుకో కార్యక్రమం నిర్వహించి బోధనకు ఆటంకం కలగజేయడం సమంజసం కాదన్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

ప్రారంభానికి ముందే శిథిలావస్థకు..!

- ప్రారంభానికి నోచుకోని యూపీహెచ్‌సీ భవనాలు
- పట్టించుకోని కూటమి నాయకులు, అధికారులు



మొగిలిపాడులో పిచ్చిమొక్కల మధ్య యూపీహెచ్‌సీ భవనం



దిష్టిబొమ్మలా మిగిలిన విలువైన భవనం

కాశీబుగ్గ: కూటమి ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం గడిచినప్పటికీ ప్రజారోగ్యంపై శ్రద్ధ కనబర్చడం లేదనే విమర్శలు ప్రజల నుంచి జోరుగా వస్తున్నాయి. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవడంలో కూడా వైద్యశాఖ అధికారులు, నాయకులు వెనుకబడి ఉన్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి ఉదాహరణగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను చెప్పుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లాగే పట్టణాల్లో కూడా యూపీహెచ్‌సీలను ఏర్పాటు చేయాలని గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పించింది. ఒక్కో ప్రాంతాన్ని యూనిట్‌గా చేసుకొని వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో మూడు యూపీహెచ్‌సీలను ఏర్పాటు చేసేందుకు కంకణం కట్టుకుంది. ఒకటో వార్డు పరిధిలోని జాతీయ రహదారికి సమీపంలో ఉన్న మొగిలిపాడు గ్రామం వద్ద, అలాగే సుమారు 2500 జనభా ఉన్న జగనన్న కాలనీ వద్ద, సూదికొండ సమీపంలో యూపీహెచ్‌సీలను ఏర్పాటు చేయాలని భావించారు. ఒక్కో భవనాన్ని రూ.85 లక్షలతో నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. వీటిలో మొగిలిపాడు, జగనన్న కాలనీల్లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పక్కా భవనాల నిర్మాణాలు పూర్తవ్వగా.. సూదికొండ వద్ద స్థల సేకరణ విషయమై వివాదం నెలకోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఆ తరువాత ఎన్నికల కోడ్ రావడంతో ఈ విషయం మరుగున పడింది. అయితే పూర్తయిన రెండు భవనాలను మాత్రం కూటమి నాయకులు ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్నారు. దీంతో విలువైన భవనాలకు చెందిన తలుపులు, కిటికీలకు చెదలు పట్టి ఊడిపోతున్నాయి. అలాగే భవనాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి దర్శనమిస్తున్నాయి. ఉన్న భవనాలను ఉపయోగించుకోవాల్సిన అధికారులు.. ప్రస్తుతం మూడుచోట్ల అద్దె భవనాల్లో యుపీహెచ్‌సీలను నిర్వహిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్తయిన భవనాలను ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

> **సమీక్షించి ప్రారంభిస్తాం**
>
> మున్సిపాలిటీలోని మూడు ప్రాంతాలలో యూపీహెచ్‌సీలు మంజూరఅయ్యాయి. వీటిలో మొగిలిపాడు, జగనన్న కాలనీలో భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే వాటికి సంబంధించి నగదు లావాదేవీల సమస్య ఉండడంతో సంబంధిత అధికారులు తమకు అప్పగించలేదు. సూదికొండలో భవనం నిర్మాణ పనులు స్థల వివాదంతో నిలిచిపోయాయి. వీటి విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష, జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించిన తరువాత ప్రారంభానికి రంగం సిద్ధం చేస్తాం. అంతవరకు వాటి నిర్వహణ ప్రైవేటు భవనాల్లో చేపడుతున్నాం.
>
> – నడిపేన రామారావు, కమిషనర్, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ

ఐక్యతతో ముందడుగు వేద్దాం

- ఎమ్మెల్సీ రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం రూరల్:

ఐక్యతతో ముందడుగు వేసి స్థానికంగా బలపడదామని ఎమ్మెల్సీ నర్తు రామారావు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్వర్ణాపురం బీచ్ వద్ద ఆదివారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిలో ప్రజలను మోసగించిందన్నారు. బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ పేరుతో ఈ నెల 21వ తేదీ నుంచి గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు కూటమి వైఫల్యాలను తెలియజేయాలన్నారు. గ్రామస్థాయి పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేస్తేనే త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో విజయాన్ని అందుకోగలమన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు పాతిర్ల రాజశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ బోర పుష్ప, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్, వైస్ ఎంపీపీలు దువ్వు వివేకానందరెడ్డి, దున్న గురుమూర్తి, మాజీ ఎంపీపీలు కారంగి మోహనరావు, నర్తు చామంతి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి పాల్గొన్నారు.

16న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ దానయ్య

మందస:

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఎంపీపీ డొక్కరి దానయ్య అన్నారు. మందస కేంద్రంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 16వ తేదీన మందసలోని శ్రీవెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్న 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' మండలస్థాయి విస్తృత సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీకి చెందిన వివిధ విభాగాల ప్రతినిధులు దల్లి జానకీరావు, బత్తిన లక్ష్మణరావు, కర్రి గోపాల్, సిందిరి జగన్, శానపతి కిశోర్, మామిడి రామకృష్ణ, దున్న హరికృష్ణ, వైకుంఠరావు, పీతాంబరం, కంచి బేహరా, దువ్వ జగదీష్, తనగాన వెంకటరావు, హరికృష్ణ, సుగ్గు కోటి, సురేష్, నవీన్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



పిన్నింటి భైరి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కంచిలి: మండలానికి చెందిన పలు కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం పరామర్శించారు. గొల్లకంచిలి గ్రామానికి చెందిన పిన్నింటి భైరి, మద్దిల కామమ్మ ఇటీవల చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. అలాగే కంచిలి గ్రామానికి చెందిన రిటైర్డు ప్రిన్సిపాల్ సింహాద్రి ప్రధాన్ ఇంట్లో ఇటీవల చోరీ జరగడంతో ఆ కుటుంబాన్ని కూడా పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శలో మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, నాయకులు దుర్గాసి ధర్మారావు, లద్దు కేశవపాత్రో, కొణపల సురేష్, తలగాన తిరుపతిరావు, డొక్కర దాలయ్య, నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడు బెందాళం శోభన్‌బాబు, బొగాబెణి సర్పంచ్ గణప సింహాచలం, వంకల దుర్యోధన, దుబ్బ అనీల్ కుమార్ పాల్గొన్నారు.

దత్తపీఠంలో గణపతి హోమం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిం దత్తనాథ క్షేత్రంలో మూడో ఆదివారం సందర్భంగా గణపతి హోమం నిర్వహించారు. ముందుగా దత్తాత్రేయ స్వామివారికి గ్రహదోష నివారణ కోసం భక్తులతో తైలాభిషేకాలు చేయించారు. అర్చకులు సింహాచల శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం, పూర్ణాహుతి జరిగింది. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

సాగునీటి వనరులకు నిధులు కేటాయించాలి

కంచిలి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని రైతు కులం వంశధార జలసాధన కమిటీ కార్యదర్శి దేశెట్టి దాలిబంధు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాయలసీమకు సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రభుత్వం రూ. వేల కోట్లు కేటాయించగా.. ఉత్తరాంధ్రకు నామమాత్రమే ఉందన్నారు. పలాస నుంచి ఇచ్ఛాపురం వరకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం చిన్ననీటి వనరుల మరమ్మతులు, అభివృద్ధి విషయాన్ని కూడా పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైతులు పడుతున్న ఇబ్బందుల పరిష్కారంపై స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టిసారించాలని కోరారు.

రైతన్నకు సాగు కష్టాలు!

- వర్షాల్లేక ఎండిపోతున్న వరినారు మడులు
- ఆందోళనలో అన్నదాత
- వరినారును కాపాడుకోవడానికి అష్టకష్టాలు



మందస-జిల్లుండ మధ్య ఎండిపోయిన వరినారు మడి

మందస: అన్నదాతకు సాగు కష్టాలు వెంటాడుతున్నాయి. మందు వేసవిలో అకాల వర్షాలు కురువడంతో ఈ ఏడాది ఖరీఫ్ అనుకూలంగా ఉంటుందని రైతులు భావించారు. గత నెలలో విస్తారంగా కురిసిన వర్షాలతో వరిసాగుకు సిద్ధమయ్యారు. మందస మండలంలో సుమారు రెండు వేల ఎకరాల్లో వరిపంటను సాగు చేస్తున్నారు. ఇందులో సుమారు 1200 ఎకరాల్లో నాట్లు వేసేందుకు నారు మండులను రైతులు సిద్ధంగా చేసుకోగా.. 800 ఎకరాల్లో వెద పద్ధతిలో సాగుకు రైతులు విత్తనాలు జల్లారు. అయితే గత 15 రోజులుగా వర్షాలు లేకపోవడంతో ఆకుమడులు ఎండిపోతున్నాయి. అలాగే వెద పద్ధతిలో వేసిన వరిపొలాలు కూడా మాడిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుణ దేవుడు కరుణ కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. వాస్తవంగా మండలంలోని ఆయకట్టుకు మహేంద్ర తనయ రిజర్వాయ నుంచి కాలువల ద్వారా సాగునీరు అందాల్సి ఉంది. అయితే సరైన వర్షాలు లేకపోవడంతో రిజర్వాయర్‌లో నీరు చేరలేదు. అలాగే కొద్దిపాటి వర్షాలు కూడా లేకపోవడంతో వరినారు మండులు ఎండిపోతున్నాయి. ఈ పరిస్థితిలో నారును కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. చెరువుల్లో కొద్దిగా ఉన్న నీటిని ట్యాంకర్ల ద్వారా తీసుకొచ్చి నారుమడులను తడుపుతూ కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అలాగే మరికొందరు ఇంజిన్ ద్వారా పైపులు వేసుకొని నారుమడులకు నీటిని మళ్లిస్తున్నారు. దీంతో ఉభాలకు ముందే పెట్టుబడి కష్టాలు వెంటాడుతున్నాయని రైతులు వాపోతున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకోవడానికి వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాల్సి వస్తుందంటున్నారు.



ట్యాంకర్ ద్వారా తెచ్చిన నీటితో నారుమడిని తడుపుతున్న రైతు



పైపుల ద్వారా నీటిని నారుమడికి మళ్లిస్తున్న దృశ్యం

ఆలయ అభివృద్ధికి విరాళం



కవిటి రాజపురం రోడ్డులోని కాళీ మాత ఆలయ అభివృద్ధికి కవిటి పట్టణానికి చెందిన పొల్లాయి ఉమామహేష్ సోదరులు రూ. 1.50 లక్షలు విరాళంగా ఆదివారం అందజేశారు. ఈ నిధులతో సింహద్వారాన్ని నిర్మించేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ పెద్దలు నిర్ణయించారు. ఆలయ అభివృద్ధికి ఉమామహేష్, సీతారాం, యోగిలు విరాళం అందించడం అభినందనీయమని అగ్నికుల క్షత్రియసంఘం నాయకుడు పొల్లాయి లక్ష్మణమూర్తి అన్నారు. –కవిటి

అమ్మవారి సంబరం



మందస మండలంలోని రాంపురం గ్రామంలో ఉజ్జిదమ్మ, మరిడమ్మ దేవతల సంబరాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించే ముందు సంబరాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా గ్రామ దేవతల విగ్రహాలను ఊరేగించి భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు మర్ల సంతోష్, భూపతి, దున్న రామారావు, తుంబనాథం, గ్రామ యువత పాల్గొన్నారు. –మందస

భక్తిశ్రద్ధలతో ఆవేటి వారాలు



పంటలు సంవృద్ధిగా పండి రైతు ఇంట సిరులు కురవాలని కోరుతూ వజ్రపుకొత్తూరు మండలం చినవంకలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ఆవేటి వారాలు నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో గ్రామస్తులంతా సంప్రదాయబద్ధంగా ఆవేటి వారాలు నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగానే ఈ ఏడాది కూడా భక్తిశ్రద్ధలతో ఆవేటి వారాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా అమ్మవారిని ప్రత్యేక అలంకరించి.. సాంస్కృతిక కార్యక్రమాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ముర్రాటలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. –వజ్రపుకొత్తూరు రూరల్

వీధులు కంపు కొడుతున్నాయ్!



కొద్రవీధిలో చెత్త నిల్వల దుర్గంధంతో ముక్కు మూసుకుని వెళ్తున్న స్థానికులు

టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని పలు వీధులు చెత్త నిల్వలతో కంపు కొడుతున్నాయి. మేధరవీధి, కొద్రవీధిలో రాకపోకలు సాగించే ప్రాంతంలో చెత్త నిల్వలు పేరుకుపోయాయి. దీంతో వస్తున్న దుర్గంధాన్ని భరించలేక ఈ మార్గంలో వచ్చే పోయే వారి ముక్కుపుటాలు పగిలిపోతున్నాయి. ఇటీవల కాలంలో పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వాహణ అధ్వానంగా మారింది. దీంతో ఏ వీధుల్లో చూసినా పారిశుద్ధ్య లోపం కనిపిస్తోంది. చెదురు మదురుగా కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మరింత క్షీణిస్తుంది. పంచాయతీ అధికారులు దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

– టెక్కలి

నిత్యం ట్రాఫిక్ వేతలే..



పలాస కేటీ రోడ్డులో గొడౌన్‌కు వెళ్తున్న జీడిపప్పు కంటైనర్‌తో నిలిచిన ట్రాఫిక్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ జంట పట్టణ వాసులను ట్రాఫిక్ ఇబ్బందులు వెంటాడుతున్నాయి. దీనికి ప్రధాన కారణం పట్టణంలోకి సమయంతో సంబంధం లేకుండా భారీ వాహనాలు ప్రవేశించడమే. వాస్తవంగా పట్టణంలోనికి పగటి వేళ భారీ, అతి భారీ వాహనాలు ప్రవేశానికి అనుమతి లేదు. అయితే ఇక్కడ ఆ నిబంధన అమలు కావడం లేదు. దీంతో ఇష్టానుసారంగా వాహనాలు ప్రవేశిస్తున్నాయి. కాశీబుగ్గ ట్రాఫిక్ పోలీసులు చూసీ చూడనట్లు విడిచి పెట్టేయడంతో ఉదయం, సాయంత్రం వేళ జంట పట్టణాల్లో ప్రవేశిస్తున్నాయి. అదే సమయంలో పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల ఉద్యోగులు, కూలీలు వారి పనిమీద వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీడి పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు సంబంధించిన గోదాంలు రోడ్డుకు ఆనుకొని ఉండడంతో భారీ వాహనాల కారణంగా ట్రాఫిక్ నిలిచిపోతుంది. తక్షణమే పోలీసు అధికారులు స్పందించి పగటిపూట జంట పట్టణాల్లోకి భారీ వాహనాలు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గెస్ట్ అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ఇచ్ఛాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న చరిత్ర, ఎంపీహెచ్‌డబ్ల్యూ అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వి.శంకరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గెస్ట్ (అతిథి) ప్రాతిపదికపై నియమించేందుకు ఈనెల 15వ తేదీ సాయంత్రం ఐదుగంటల్లో అర్హులైన వారు కళాశాలలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. ఈ నెల 18వ తేదీన శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల పనివేళలో సంప్రదించాలన్నారు.

'కోట' మృతికి సంతాపం

టెక్కలి: విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల టెక్కలికి చెందిన సుదర్శన్ థియేటర్ యజమాని సత్తారు వెంకటరమణతో పాటు సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం థియేటర్ ఆవరణలో కోట చిత్రపటానికి నివాళులర్పించా రు. వందలాది సినిమాల్లో తన విలక్షణ నటనతో తెలుగు ప్రేక్షకుల మదిలో స్థానం సాధించుకున్న కోట మృతి తెలుగు సిని మా పరిశ్రమకు తీరని లోటని వెంకటరమణ పేర్కొన్నారు.